జగన్‌తోనే ప్రజా సంక్షేమం

● 'గడప గడప'లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పారదర్శకపాలన ద్వారా అన్ని వర్గాల వారికి మేలు చేయడమే మా ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కెంచానపల్లిలో జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి, సర్పంచ్ భారతితో కలసి ఆయన గురువారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఇంటా ఓ పెద్దకొడుకుగా, సోదరుడిగా భావిస్తున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రిపైనా, పార్టీపైనా, ఎమ్మెల్యేలపైనా టీడీపీ నాయకులు బురద జల్లడం సిగ్గుచేటన్నారు. 40 ఏళ్ల రాజకీయానుభవం అంటున్న 420 బొల్లి నాయుడుకు ప్రజల సంక్షేమం ఏనాడు పట్టలేదని ఆరోపించారు. అదే బాటలోనే స్పీడ్ బ్రేకర్ సుందరాంగుడుగా పిలువబడే మురికి కాలవ కూడా నడుస్తున్నాడని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో ఆయన, ఆయన చెంచాలు మాత్రమే పందికొక్కుల్లా దోచుకున్నారని దెప్పిపొడిచారు. కార్యక్రమంలో బోర్‌వెల్ నాగిరెడ్డి, వైస్ సర్పంచ్ శేఖర్, సహకార సంఘం అధ్యక్షుడు భీమన్న, సచివాలయాల మండల కన్వీనర్ ధనుంజయ, శివారెడ్డి, రేకులకుంట సర్పంచ్ ఎర్రిస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, గొల్ల శివప్ప, బుజ్జి, డీలర్ మురహరి, పాండు, హరి క్రిష్ణ, గొల్ల శీనప్ప, శర్మస్, గాజుల చెన్నకేశవులు, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండయ్య, మండల విస్తరణాధికారి రఘురామారావు, ఏపీఓ నీరజ, పీఆర్‌జేఈ మునయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కదరంపల్లిలో..

మండలంలోని కదరంపల్లిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య గురువారం తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని వారు కోరారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'


ఉరవకొండ రూరల్: మండలంలోని ఆమిద్యాలలో శుక్రవారం ఉదయం ఏడు గంటలకు మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ రూరల్ కన్వీనర్ వెలిగొండ నరసింహులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు హాజరు కావాలన్నారు.

విధులకు డుమ్మాకొడితే చర్యలు

శెట్టూరు: సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మాకొడితే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి హెచ్చరించారు. గురువారం మండలంలోని చిన్నంపల్లి, బచ్చేహళ్లి సచివాలయాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో భాగంగా రికార్డులు తనిఖీ చేశారు. విధుల్లో ఉన్నప్పుడు సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. అలాగే సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమం తప్పనిసరిగా సచివాలయాల్లో నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గరుడ వాహనంలో శ్రీవారు



బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీనివాసుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీనివాసుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనోత్సవానికి సహకరించిన దాతలను పూలమాల, శాలువాతో సన్మానించారు. స్వామికి భక్తులు పూజలు నిర్వహించి, మొక్కులను తీర్చుకొన్నారు. శ్రీవారి గరుడాలంకరణ వేషధారణలో భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నేడు సంత వేలం

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామ పంచాయతీలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంతకు శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి లోకేష్ గురువాం తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు గ్రామ సచివాలయం వద్ద విస్తరణ అధికారి సమక్షంలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ. 2 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

మండల సచివాలయ కన్వీనర్‌గా రామాంజనేయులు



బొమ్మనహాళ్: మండల సచివాలయ కన్వీనర్‌గా దేవగిరి రామాంజనేయులు నియమితులయ్యారు. . గురువారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి, కాపు ప్రవీణ్‌రెడ్డిని సచివాలయ కన్వీనర్ సన్మానించారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా విజయవంతం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వన్నూరుస్వామి, కృష్ణ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

రాయదుర్గంటౌన్: క్యాన్సర్‌తో మృతి చెందిన పింజరి హుస్సేన్‌సాబ్(55) కుటుంబానికి 21వ వార్డు కౌన్సిలర్ డిష్ గోవిందు చేయూతనందించారు. బుధవారం రాత్రి ఆయన మృతి చెందగా.. కౌన్సిలర్ గోవిందు గురువారం కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.అంత్యక్రియలకు సహకరించాలని ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాల్మీకి మల్లికార్జున, పవన్ కుమార్, సూరి, నగేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా అంజుమన్ అజ్మతుల్లా కమిటీ ఆధ్వర్యంలో సొంతూరు గుమ్మఘట్ట మండలం నేత్రపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

డ్రోన్‌తో మందు పిచికారీ!


డ్రోన్ స్ప్రేయర్‌తో మందు పిచికారీ చేయిస్తున్న రైతులు

బెళుగుప్ప: మండల కేంద్రంలో రైతులు రామేశ్వరరెడ్డి, తిప్పేస్వామి తదితరులు సాగు చేసిన మొక్క జొన్న పంటలో పురుగు ఉధృతి అధికంగా ఉండటంతో గురువారం డ్రోన్ స్ప్రేయర్‌తో రసాయమందులను పిచికారీ చేయించారు. ఇదివరకు రసాయన మందులు పిచికారీ చేసేందుకు మనుషులు మోస్తూ వుండే స్ప్రేయర్‌ల స్థానంలో ప్రస్తుతం డ్రోన్ స్ప్రేయర్లు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఆధునిక సాంకేతికను అందించి వ్యవసాయ అభివృద్ధికి పూర్తిస్థాయి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సబ్సిడీతో డ్రోన్ స్ప్రేయర్‌లను అందిస్తోందని ఏఓ పృథ్వీసాగర్ తెలిపారు.

భూసార పరీక్షలు చేయించండి


మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మానాయక్

రాయదుర్గం రూరల్: రైతులు భూసార పరీక్షలు చేయించాలని ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. మండలంలోని 74 ఉడేగోళం ఆర్బీకేలో ఐదు మండలాల వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్ర సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. భూసార పరీక్షల ఆధారంగా సంబంధిత భూమికి ఎరువులు వినియోగించేలా రైతులకు సూచనలివ్వాలని ఆయన ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి రైతుభరోసా కేంద్రంలో ఈ యంత్రసేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మండలంలోని ప్రతి మూడు రైతు భరోసా కేంద్రాల్లో కిసాన్ డ్రోన్ పథకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు మహేంద్ర, మహమ్మద్ బాషా, నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలవా... అభివృద్ధిపై జాబితా ఇదిగో..!


వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మాట్లాడుతున్న కాపు ప్రవీణ్

కణేకల్లు: నాలుగేళ్ల జగనన్న పాలనలో ఎస్.హనుమాపురం గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం.. నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలిచ్చాం.. వీటికి సంబంధించిన జాబితా ఇదిగో అంటూ పూర్తి వివరాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తనయుడు కాపు ప్రవీణ్‌రెడ్డి మీడియా ముందు ప్రకటించారు. కణేకల్లు మండలంలోని ఎస్.హనుమాపురం గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ట.కేశవరెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి పనులపై సవాల్ విసిరితే దాన్ని సాదారంగా స్వీకరించి మీరేం చేశా రో వివరాలతో ప్రజల్లో రావాలే గాని పబ్లిసిటీ కోసం వచ్చి రచ్చ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చేసిన అభివృద్ధి గురించి చెప్పకపోగా.. కాపు ఖబడ్దార్ అంటూ అల్టిమేటం చేయడం లాంటి కాల్వ నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. నాలుగేళ్ల జగనన్న పాలనలో ఎస్.హనుమాపురంలో రూ. కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా లబ్ధిదారుల ఖాతాల్లో రూ. కోట్లు జమచేశామన్నారు. సర్పంచు ఫణీంద్ర, ఎంపీటీసీ జయరాం, మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షవర్ధన్, వడ్డే రవీంద్ర, భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంపై చర్యలు తీసుకోండి

విడపనకల్లు: వైఎస్సార్ కాంత్రి పథం ఏపీఎం ఆంజినేయులపై చర్యలు తీసుకోవాలని యానిమేటర్లు జెడ్పీటీసీ హనుమంతు ఎదుట వాపోయారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సీసీలు,యానిమేటర్ల ఇతర సిబ్బందితో జెడ్పీటీసీ సమీక్ష నిర్వహించారు. లైంగికంగా, మానసికంగా ఏపీఎం వేధిస్తున్నారని కొంతమంది మహిళా యానిమేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లుకు చెందిన మహిళా యానిమేటర్లు ఏపీఎంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అతడిపై చర్యలు తీసుకోకపోతే న్యాయం కోసం దిశ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తామన్నారు.

ఎస్ఎస్ఏ ఏఈఈ చికిత్సకు ఆర్థిక సాయం


రవి బంధువులకు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కణేకల్లు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్వశిక్ష అభియాన్ ఏఈఈ రవి (42)కి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. కణేకల్లు మండలంలోని ఎస్.హనుమాపురం గ్రామంలో మూడ్రోజుల క్రితం ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీ కొని రవి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రి వైద్యులు అతన్ని బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. ఆయన కుటుంబ సభ్యుల వినతి మేరకు ఉపాధ్యాయులు మానవతా దృక్పథంతో స్పందించి రూ.2.25 లక్షలు పోగు చేశారు. ఈ మొత్తాన్ని గురువారం స్థానిక ఎమ్మార్సీలో బంధువులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మండల ఆగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.శేషారెడ్డి, సంఘం నాయకులు మల్లెల మోసెస్, శివారెడ్డి, వెంకటేశులు, సీఆర్పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టెట్రా ప్యాకెట్ల స్వాధీనం

ఉరవకొండ: మండలంలోని నింబగల్లు సమీపంలో ఉపేంద్ర అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా ఉరవకొండ ఎక్సైజ్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మారుతి రావు గురువారం తెలిపారు. నిందితుడిని జడ్జి ఆదేశాల మేరకు సబ్ జైలుకు తరలించామన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన


వజ్రకరూరు: వెంకటాంపల్లి పెద్దతండాలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


బ్రహ్మసముద్రం: చెలిమేపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు/బ్రహ్మసముద్రం/శెట్టూరు/వజ్రకరూరు/విడపనకల్లు: సంక్షేమ పథకాలు అందించి.. మా భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కంబదూరు మండలంలోని ములకనూరు, ఒంటారెడ్డిపల్లి, చెన్నంపల్లి, కుర్లపల్లి, మంద, అండేపల్లి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు. చంద్రబాబు పాలన, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, వైస్ ఎంపీపీ బీమేష, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, నాయకులు గంగాధర్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, మల్లారెడ్డి, నరేంద్ర, ఎరికుల సత్తి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండలంలోని చెలిమేపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు చంద్రశేఖర్, సంజీవ, శివ తదితరులు పాల్గొన్నారు. శెట్టూరు మండలంలోని యాటకల్లు, లక్ష్మంపల్లి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు ఈరన్న, వన్నూరుస్వామి, నాయకులు ముత్యాలు, లక్ష్మణమూర్తి, ఈశ్వరప్ప పాల్గొన్నారు. అలాగు వజ్రకరూరు మండలంలోని వెంక టాంపల్లిపెద్దతాండాలో ఎంపీపీ రమావత్ దేవి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, సర్పంచు కొర్రా శివాజీనాయక్, ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి సామానాయక్, డీలర్ గోపాల్ తదితరుల ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. విడపనకల్లు మండలంలోని పాల్తూరు ఎస్సీ కాలనీలో సచివాలయ-2 కన్వీనర్ ప్యాపిలి నాగరాజు, విడపనకల్లు సొసైటీ చైర్మన్ శ్రీరాములు తదితరుల ఆధ్వర్యంలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు.

23న ప్రవేశ పరీక్ష

ఉరవకొండ/కంబదూరు/బ్రహ్మసముద్రం: ఉరవకొండలోని ఏపీ సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశం కల్పించడం కోసం ఈనెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.భారతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతి విద్యార్థులకు ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ రేణుమాకుపల్లి రహదారిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. అలాగే కంబదూరు మండలంలోని తిమ్మాపురం వద్ద ఉన్న గురుకుల బాలికల పాఠశాల, బ్రహ్మసముద్రం మండలంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయంలో ఈనెల 23న 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాళ్లు విజయలక్ష్మి, సత్యవతమ్మ గురువారం తెలిపారు.

ఎమ్మెల్సీకి వినతి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలోని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి స్వగృహంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్సీని ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం (ఏఐబీఎస్ఎస్)నాయకులు కలిశారు. బోయ, వాల్మీకి, బెంతో ఓరియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ఇటీవల ప్రభుత్వం చేసిన తీర్మాణాన్ని ఉపసంహరించుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని వారు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఏఐబీఎస్ఎస్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, జిల్లా యువజన అధ్యక్షుడు రామాంజనేయులునాయక్, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌నాయక్, జిల్లా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజునాయక్, వజ్రకరూరు, ఉరవకొండ మండల నాయకులు ఈశ్వర్‌నాయక్, కుళ్లాయినాయక్, రామ్లునాయక్, దీపానాయక్, ప్రసాద్ నాయక్, శేవ్యానాయక్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన తప్పనిసరి


కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు


రాయదుర్గంటౌన్: అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్/ఉరవకొండ: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత తప్పనిసరి అని డీఎస్పీ బి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఫైర్ స్టేషన్‌లో గురువారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రాణ, ఆర్థిక నష్టాలను నివారించేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ నజీర్ అహమ్మద్, ఆర్టీసీ డీఎం రామచంద్ర, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో పీఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ ఆదిశేషయ్య, లీడింగ్ ఫైర్‌మెన్లు, ఫైర్‌మెన్లు పాల్గొన్నారు. ఉరవకొండ పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో సిబ్బంది వినియోగించే వివిధ రకాల పరికరాల ఎగ్జిబిషన్‌గా ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏవీఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విక్రమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి భీమలింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బీటీ రోడ్డుకు భూమిపూజ

ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల మేర భక్తుల సౌకర్యార్థం ఎస్.ఆర్. కన్‌స్ట్రక్షన్ చేపట్టిన ఉచితంగా బీటీ రోడ్డు నిర్మాణానికి ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె. విజయ్‌కుమార్, అర్చకులు గురువారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోండి

విడపనకల్లు: అర్హత ఉండి ఇంత వరకు కూడా రైతు భరోసా పథకం పొందని రైతులు తక్షణమే ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకే దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పెన్నయ్య సూచించారు. మండలంలోని పెద్ద కొట్టాలపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ గురువారం తనిఖీ చేశారు. ఈనెల 30 లోపు అర్హులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా ఐదుగురు రైతులు గ్రూపు ఏర్పడి 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్, యంత్ర పరికరాలను తీసుకోవచ్చన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు

అనంతపురం కల్చరల్: కల్యాణదుర్గం మండలంలోని అక్కమ్మ దేవత ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎండోమెంట్ జిల్లా ఏసీ రామాంజనేయులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లోపు ' డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, దేవదాయ శాఖ, కృష్ణానగర్, కర్నూలు' చిరునామాకు చేరేలా దరఖాస్తులు పంపాలన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఉరవకొండ: స్థానిక జామీయా మసీదులో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు గురువారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అభిమానులు శిలార్ మగ్బూల్, ఆమిద్యాల చెన్నారెడ్డి, ముస్తూరు ఎర్రిస్వామి, కోనాపురం ఎర్రిస్వామి, అర్జున్, నబి తదితరుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం వారు ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురండి

వజ్రకరూరు: చక్కగా బోధించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ ఎర్రిస్వామి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో 98 డీఎస్సీలో క్వాలిఫై అయ్యి ఇటీవల విధుల్లో చేరిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ఫలించిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు.


మెగా రక్తదాన శిబిరం

కంబదూరు: మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన శిబిరంలో మండల వ్యాప్తంగా పలువురు యువకులు రక్తదానం చేశారు.కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు,ఏటీఎల్ జయచంద్రా రెడ్డి,సీఓ భాగ్యనందస్వామి తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ రుసుం వసూలుకు నేడు వేలం

రాయదుర్గంటౌన్: దేవదాయశాఖ పరిధిలోని రాణిఛత్రం టోల్ గేట్ రుసుం వసూలుకు శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాణిఛత్రం ఖాళీస్థలాల్లో నిలుపు వాహనాలు, తోపుడు బండ్లపై దినసరి వ్యాపారం చేసుకునే వారి నుంచి ఏడాది కాలానికి టోల్ గేట్ వసూలు చేసేందుకు వేలం నిర్వహిస్తామన్నారు.

సర్మస్ హుసేన్నీ దర్గాలో ఫాతేహాలు


అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్నీ స్వామి దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణంలో కందూరీలు చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

వజ్రకరూరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎంపీడీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం కింద నూతనంగా 250 పనులు మంజూరయ్యాయన్నారు. ఇందులో డకౌట్‌పాండ్స్, చెక్‌డ్యాంలు, డీషెల్టింగ్, సర్క్యులేషన్ ట్యాంకులు, స్టాగర్ ట్రెంచులు తదితర పనులున్నాయన్నారు. జూన్ ఆఖరులోపు రూ.7 కోట్ల మేర పనులు కల్పించాలని, లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేష్ నాయక్, ఈసీ ప్రభాక ర్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

'బీజేపీని సాగనంపుదాం'

విడపనకల్లు: కేంద్రంలోని బీజేపీని సాగనంపాలని సీపీఐ నాయకులు సూచించారు. గురువారం మండలంలోని పాల్తూరు, హావళిగి,వి.కొత్తకోట, ఉండబండ, విడపనకల్లు తదితర గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ గత తొమ్మిదేళ్ల పరిపాలనలో ప్రధాని మోదీ చేసిన ప్రజా వ్యతిరేక విధానాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్ ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చెంద్రాయుడు, విడపనకల్లు, వజ్రకరూరు మండల కార్యదర్శులు రమేష్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి గ్రామంలో గురువారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బి.సోమశేఖర్‌రెడ్డి సహకారంతో కర్నూలుకు చెందిన సురక్ష హెల్త్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. దాదాపు 200 మందికి గుండె, కిడ్నీ, లివర్ సంబంధిత, కీళ్లనొప్పులు, గ్యాస్ ట్రబుల్ తదితర జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు శ్రావణి, శర్వమణి, వైఎస్సార్‌సీపీనాయకులు హనుమంతనాయుడు, వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఐదుకల్లు రోడ్డు వద్ద ఉన్న ఊరి చెరువు వద్ద గురువారం తేనెటీగల దాడిలో ఆరుగురు యువకులు గాయపడ్డారు. ఈత కోసం వెళ్లిన యువకులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో అందరూ ఒక్కసారిగా పరుగు పెట్టారు. తేనెటీగల దాడిలో గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో మారుతి అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు.

ఫైబర్ సిలిండర్లతో ప్రమాదాల నివారణ

రాయదుర్గంటౌన్: సురక్షితమైన ఫైబర్ గ్యాస్ సిలిండర్లతో ప్రమాదాల నివారణను పూర్తిగా అరికట్టవచ్చని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ కృష్ణ తెలిపారు. ప్రస్తుతం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఫైబర్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పట్టణంలోని ఆత్మకూరు వీధిలో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గ్యాస్ ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ గోనబావి నిజాముద్దీన్, ఇండేన్ గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుంటున్న స్థానికులు

కళ్యాణదుర్గం: భూమి సర్వే చేసే విషయంలో రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిక్కిహరి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన గురువారం కళ్యాణదుర్గంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... బిక్కి హరికి కళ్యాణదుర్గం పొలం సర్వే నంబర్ 409లో కొంత భూమి ఉంది. దాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఇటీవలే ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. తన భూమిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెళ్లగా ఆక్రమణదారులు అడ్డుకున్నారని అధికారులు తెలిపారు. తన భూమి సర్వే చేసి ఇవ్వాలని పలుమార్లు మండల తహసీల్దార్, సర్వేయర్లను విన్నవించినా ఫలితం లేకపోయింది. పైగా భూ ఆక్రమణదారులకే రెవెన్యూ అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు తెలుసుకున్న బిక్కి హరి, గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుటే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు, స్థానికులు అతన్ని రక్షించి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాపై దుష్ప్రచారం చేస్తున్నారు

భూములు లాక్కున్నారని కావాలనే కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ తిప్పేస్వామి అన్నారు. ఆయన స్వగృహంలో గురువారం రాత్రి విలేకరులతో మాట్లాడారు.